క్లుప్తంగా

జర్నలిస్టు కుటుంబాలకు చేయూత



చెక్కు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 96 మంది జర్నలిస్టు కుటుంబాలకు టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లో చెక్కులు పంపిణీ చేశారు. జర్నలిస్టులుగా పని చేస్తూ గత ఏడాది మృతి చెందిన ఏబీఎన్ రాజు, ఆంధ్రప్రభ సూర్యం, భద్రాచలంకు చెందిన మోహన్, పాల్వంచకు చెందిన ఫిరోజ్ కుటుంబాలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు కల్లోజి శ్రీనివాస్, వట్టికొండ రవి, చంద్ర నరసింహారావు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని వివిధ విభాగాలలో అవుట్ సోర్సింగ్ పనులు ఇప్పిస్తామని దళారులు అమాయకులైన నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా మాయమాటలు చెబితే వారి వివరాలు తమకు తెలియపర్చాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలేంరాజు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏరియాలో కొంతమంది నిరుద్యోగులకు ఆశలు కల్పించి మాయమాటలు చెప్పి డబ్బు వసూలు చేస్తున్నట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, అటువంటి జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు సింగరేణిలో లేవని, వారి మాటలు నమ్మి యువత మోసపోవద్దన్నారు. అంతేకాకుండా కొంత మంది కాంట్రాక్టర్లు కంపెనీలో అవసరానికి మించి కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకుంటూ కార్మికుల మస్టర్లకు కోత విధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కంపెనీ నిబంధనల మేరకే కార్మికులను తీసుకోవాలన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

జూలూరుపాడు: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శారద, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్‌కుమార్ బుధవారం నిల్వ ఉన్న నీటిలో గంబూసియా చేపలను వదిలారు. డాక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ జ్వరాలు రాకుండా దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గిర్దావర్ ఎం.తిరుపతిరావు, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, వెంగన్నపాలెం జీపీ సెక్రటరీ పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి నేషనల్ హెల్త్ స్కీమ్ వర్కర్ల సమ్మె

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారం కోసం నేషనల్ హెల్త్ స్కీమ్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఈనెల 31 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు బుధవారం కలెక్టర్, జిల్లా వైద్యాధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. మొదట కలెక్టరేట్ ఎదుట సమాన పనికి.. సమాన వేతనం చెల్లించాలని, క్రమబద్ధీకరించాలని, హెల్త్‌కార్డులు, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడారు. వి.శ్రీనివాసరావు, సావిత్రి, కుంజా మాధవి, వీరన్న, పావని, దిలీప్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హులైన పేదలకు గృహలక్ష్మి, ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరుతూ అదనపు కలెక్టర్ రాంబాబుకు సీపీఐ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణ కార్యదర్శి వై.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని గృహలక్ష్మి ఇళ్ల పట్టా రిజిస్ట్రేషన్‌తో పాటు 100 గజాల లోపు ఉన్నవారికి మాత్రమే ఇస్తామని సర్వేకు వచ్చిన అధికారులు చెబుతున్నారని, దీంతో పేదలు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా డబుల్‌బెడ్ రూం ఇళ్లు రాని పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని ప్రభుత్వం, కలెక్టర్ హామీ ఇచ్చారని దరఖాస్తు చేసిన పేదలంతా ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఆంక్షలు లేకుండా ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, విజయకుమార్, పట్టణ సహాయ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రయాన్ - 3 అద్భుతం

- వసతి గృహాల్లో ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించిన విద్యార్థులు
- సర్వత్రా హర్షం



కొత్తగూడెంఅర్బన్: రైల్వేస్టేషన్ వద్ద ప్రదర్శనలో వివేకవర్ధని పాఠశాల విద్యార్థులు, నిర్వాహకులు



పాల్వంచరూరల్: కిన్నెరసానిలోని గిరిజన గురుకుల కళాశాలలో..



సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చంద్రయన్-3 ల్యాండింగ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్/పాల్వంచ/పాల్వంచరూరల్: చంద్రయాన్–3 స్పేస్ క్రాఫ్ట్ చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టింది. గత జూలై 14న ఇస్రో సైంటిస్టులు చంద్రయాన్–3 స్పేస్ క్రాఫ్ట్ విక్రమ్ ల్యాండర్‌ను పంపించారు. ఇది 41 రోజుల పాటు ప్రయాణం చేస్తూ ఐదుసార్లు భూమధ్యంతర కక్ష్యలో, మరో ఐదుసార్లు చంద్రుని కక్ష్యలో తిరిగి ఎట్టకేలకు భారత కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 6:04 గంటలకు తన గమ్యాన్ని చేరుకుంది. ఈ ప్రయోగంలోని కీలకఘట్టాన్ని ప్రజలు, పలు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారాల్లో వీక్షించారు. కిన్నెరసాని డ్యామ్ సైడ్‌లోని గిరిజన ప్రతిభా జూనియర్ కళాశాల, పాఠశాల, లక్ష్మీదేవిపల్లి పంచాయతీలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు జాబిల్లిపై విక్రమ్ ల్యాండర్ ల్యాండింగ్‌ను వీక్షించి కరతాళధ్వనులతో శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జయహో భారత్.. జయహో ఇస్రో.. అంటూ విద్యార్థులు, యువత, ప్రజలు నినాదాలతో హోరెత్తించారు. కొత్తగూడెంలోని వివేకవర్ధని పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ హాజరయ్యారు. మాట్లాడుతై.. భారత శాస్త్రవేత్తలు సాధించిన గొప్ప విజయమని, విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్ర సాంకేతిక రంగం వైపు వెళ్లేందుకు ఇటువంటి కార్యక్రమంలో వారిని భాగస్వామ్యం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

దేశ ఔన్నత్యం చాటిన క్షణం



మన దేశ ఔన్నత్యం ప్రపంచానికి తెలిసింది. మనం తలచుకుంటే ఏదైనా సాధించగలం అనడానికి ఇది ఒక ప్రత్యక్ష సాక్షం. మన చంద్రయాన్–3 జాబిల్లి మీద అడుగిడటం గర్వకారణం. దీనికి కృషి చేసిన శాస్త్రవేత్తలకు అభినందనలు. దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచం నలుమూలలకు తెలియజేయడం మనకు గర్వకారణం.

– ఎం.పరీష్, డీఏవీ స్కూల్, పాల్వంచ

మనదేశానికి గర్వకారణం



చంద్రయాన్– 3 విజయం దేశ ప్రజల విజయం. దీనిని మా పాఠశాల్లో ప్రత్యేక్ష ప్రసారం ద్వారా చూపించారు. దీని గురించి మేము ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాం. గతంలో చంద్రయాన్ వెళ్లి విఫలమైనా ఈసారి విజయవంతం కావడం ప్రపంచంలో మనదేశానికి అగ్రస్థానం.

– సుస్మిత, 9వ తరగతి
జెడ్పీఎస్ఎస్, కేటీపీఎస్ స్కూల్

విజ్ఞానమే గొప్ప సంపద



ప్రపంచంలో మన భారతదేశ శాస్త్రవేత్తలు అత్యంత గొప్ప ప్రతిభ కలిగిన వారు అని చెప్పడానికి చంద్రయాన్ – 3 విజయమే సాక్షం. ఇప్పటికే ప్రపంచ దేశాల్లో మన సత్తా ఏంటో చూపించాం. మరోసారి ఈ చంద్రయాన్ – 3 ఈతరం వారికి ఒక అధ్యయనంగా చెప్పవచ్చు. రాబోయే మరిన్ని విజయాలు అందుకుంటాం.

– సాయి మేఘన, 9వ తరగతి, డీఏవీ స్కూల్

టోల్‌గేట్‌ను ఇక్కడి నుంచి తరలించాలి



హరిప్రియకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

టేకులపల్లి: నేషనల్ హైవే 930పి లో భాగంగా సులానగర్–రాజుతండా మధ్యలో నిర్మించనున్న టోల్‌గేట్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో ఎమ్మెల్యే బానోతు హరిప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. టోల్‌గేట్ నిర్మాణం కోసం 16 ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు హద్దులు పెడుతున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వ్యవసాయ భూమినే నమ్ముకుని గిరిజనులు, గిరిజనేతరులు జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు అది కోల్పోవడం వల్ల జీవనోపాధిని కోల్పోతామని వాపోయారు. టోల్‌గేట్‌ని వేరే ప్రాంతానికి తరలించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రెండో ఏఎన్‌ఎంలకు సంఘీభావం

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్న రెండో ఏఎన్ఎంల సమ్మె బుధవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. సీఐటీయూ నాయకులు డి.వీరన్న, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు ధనలక్ష్మి సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా నాయకులు వి.మల్లికార్జునరావు, మెడికల్ ఉద్యోగులు రాంప్రసాద్, నాగేశ్వరరావు, సుశీల, ఆమని, ఎండీ సజ్జాభేగం, బానోత్ ప్రియాంక, కౌసల్య, అరుణ, రాములమ్మ, పార్వతి, పుష్ప పాల్గొన్నారు.

'మున్సిపల్'కు కార్మికుల తాళం



కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: ఎన్నో అవార్డులు తెచ్చి పెట్టిన ఘనత ఉన్న మున్సిపల్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. బుధవారం పనులు విరమించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వేతనాలు చెల్లించే వరకు సమ్మె చేస్తామంటూ భీష్మించుకున్నారు. ఉద్యోగులు విధులకు హాజరయ్యే సమయంలో కార్యాలయం ప్రధాన ద్వారానికి తాళం వేసి నిరసన తెలిపారు. దీంతో ఉద్యోగులు కార్యాలయంలోకి వెళ్లకుండా ఆరుబయటే ఉండిపోయారు. సమాచారం అందుకున్న మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆందోళన వద్దకు చేరుకుని వారితో చర్చించారు. మూడు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు అంగీకరించి, ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు. పాయం వెంకన్న, యాకుబ్ షావలీ, నబీ, దేవరకొండ శంకర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేసుకోండి

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల ప్రజలు వర్షాకాలంలో మలేరియా, డెంగీ వంటి విషజ్వరాల బారిన పడకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) జేవీఎల్ శిరీష అన్నారు. ఉల్వనూరు గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మామిడిగూడెం, రేగులగూడెం గ్రామాలను డీఎంహెచ్ఓ బుధవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న దోమలమందు పిచికారీని పరిశీలించారు. మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు దోమల కారణంగా వస్తాయని ఈ వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి దోమల నివారణ మందును ఇంటింటికీ పిచికారీ చేస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల వద్ద మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమతెరలను వాడుకోవాలని సూచించారు. ఏఓ మోహన్, ఎంపీహెచ్ఏ రామిరెడ్డి, జేతురాం పాల్గొన్నారు.

బురద నీరు తాగేదెలా..?



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ ప్రజలకు కిన్నెరసాని నుంచి బురదనీరు సరఫరా అవుతోందని నిరసన వ్యక్తం చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం ప్లకార్డులు, బురదనీరు పట్టుకుని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ బురదనీటిని కలెక్టర్‌కు చూపించి సమస్యను పరిష్కరించాలని, ప్రతిరోజూ మంచినీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. వేసవిలో 10 – 15 రోజులకోసారి తాగునీరు సరఫరా చేసిన అధికారులు వర్షాకాలంలో బురదనీటిని సరఫరా చేస్తున్నారని విమర్శించారు. దీనిపై ఎమ్మెల్యే, పాలకపక్షం కనీసం స్పందించక పోవడం శోచనీయమన్నారు. విషయం ముఖ్యమంత్రికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో బురదనీటిని పోస్టల్‌లో పార్సిల్ ద్వారా పంపించినట్లు వివరించారు. ప్రజలకు శుభ్రమైన నీటిని సరఫరా చేసేవరకు ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, సాయి, వంగా రవిశంకర్, లత, కోమలి తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పాల్వంచరూరల్: పాల్వంచ మండల సర్వసభ్య సమావేశం రేపు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వశాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ప్రభుత్వశాఖల ప్రగతి నివేదికలను అధికారులు గురువారం కార్యాలయంలో అందజేయాలని కోరారు.

కోటి వృక్షార్చనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

పాల్వంచరూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈనెల 26వ తేదీన నిర్వహిస్తున్న కోటి వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బి.అప్పారావు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 36 గ్రామపంచాయతీల్లోని నర్సరీలో ఉన్న మొక్కలను పంచాయతీకి వెయ్యి మొక్కల చొప్పున మొత్తం 36వేల మొక్కలను శనివారం నాటాలన్నారు. అన్ని పంచాయతీల్లో సోక్‌పిట్ పనులను తర్వితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో కార్యదర్శులు, ఈజీఎస్ ఏపీఓ రంగా, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ట్రెంచ్ పనుల అడ్డగింత

ఇల్లెందురూరల్: తిలక్‌నగర్ గ్రామపంచాయతీ కుమ్మరిబస్తీలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ట్రెంచ్ పనులను సర్పంచ్ ధనసరి స్రవంతి, స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. ప్రస్తుతం జేకే ఓసీ పనులు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్న సింగరేణి యాజమాన్యం కుమ్మరిబస్తీలో ఇళ్ల మధ్యగా ట్రెంచ్ తీసేందుకు పనులకు ఉపక్రమించింది. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకొని ట్రెంచ్ పనులను నిలిపివేశారు. అక్కడకు వచ్చిన అధికారులను నిలదీశారు. ఎవరిని అడిగి ట్రెంచ్ పనులు చేపట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జేకే ఓసీ ప్రజాభిప్రాయ సభలో చెప్పిన విషయాలకు భిన్నంగా వ్యవహరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

కేఓసీలో పర్యటన

టేకులపల్లి: సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి బుధవారం కోయగూడెం ఓపెన్‌కాస్టులో పర్యటించారు. ఈ సందర్భంగా ఓసీ పని స్థలాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజువారీ బొగ్గు ఉత్పత్తి రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జీఎం జాన్ ఆనంద్‌ను అడిగి తెలుసుకున్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని, వార్షిక లక్ష్యాలను అధిగవించాలని కోరారు.

సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్(పా) బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జరిగే అవినీతి అక్రమాలపై సమచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని సింగరేణి డైరెక్టర్(పా), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎన్.బలరామ్ అన్నారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 5 వరకు నిర్వహించనున్న విజిలెన్స్ వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సెంట్రల్ విజిలెన్స్ ఆదేశాల మేరకు ఈ వారోత్సవాల సందర్భంగా మూడు నెలల పాటు ముందస్తు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సంస్థలో ఏమైనా అవకతవకపై సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. విజిలెన్స్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజిలెన్స్ జీఎం కే.ప్రసాద్‌రావు, డీజీఎం(విజిలెన్స్) వీఎస్‌వీఎస్‌ఆర్ శాస్త్రి, రాజేందర్‌రెడ్డి, రామచందర్, పీవీఎస్ శాస్త్రి, బీవీ చలపతిరావు, బి.సమ్మయ్య, ఎండీ హసీంపాషా తదితరులు పాల్గొన్నారు.

27న ఖమ్మంలో అమిత్‌షా బహిరంగ సభ



మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

చుంచుపల్లి: ఈ నెల 27న ఖమ్మంలో జరగనున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ఏనుగుల రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని బీజేపీ కార్యకర్తలు తరలివచ్చేందుకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయాలని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. సమావేశంలో గోవా ఎమ్మెల్యే అమోంకర్, ఎడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల నాగేశ్వరరావు గౌడ్, నరేంద్రబాబు, రమేష్, రాయుడు నాగేశ్వరావు, సత్యనారాయణ, రవీందర్, లక్ష్మణ్ అగర్వాల్, జల్లారపు శ్రీనివాస్, రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ధర్నా, నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు బుధవారం నవభారత్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. డీఎంహెచ్ఓకు వినతిపత్రం డాక్టర్ శిరీషకు అందజేశారు. ఆరునెలల పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలని, లెప్రసీ సర్వేలో వస్తున్న ఇబ్బందులను పరిష్కరించడానికి ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున పదహారు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించాలని, శ్రమకు తగిన వేతనం చెల్లించాలని విన్నవించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జిలకర పద్మ, దొడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న చలో 'హైదరాబాద్'



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 29న హైదరాబాదులో ఇఫ్టూ నిర్వహించే భారీ ప్రదర్శన, ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలం ఆంజనేయపురంలో నిర్వహించిన తెలంగాణ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం అనంతరం ప్రచార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కులను కాలరాసిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ సెంటిమెంటుతో అధికారంలో కొనసాగుతూ మాటలకే పరిమితమైందని, కార్మిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. నరాటి వెంకటేశ్వర్లు, మోత్కూరి మల్లికార్జునరావు, రాయండ్ల కోటిలింగం, డి.నూనెశ్వరరావు, పల్లి సుధాకర్, అంజయ్య పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 29న ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి పిలుపునిచ్చారు. బుధవారం పోలారం గ్రామంలో ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో గొని నాగేశ్వరరావు, జటంగి వెంకన్న, పందిర్లపల్లి వీరన్న, రాజు, రవి, భీముడు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు భరించలేకపోతున్నాం..



నిరసన తెలియజేస్తున్న లారీ యజమానులు, కుటుంబ సభ్యులు

టేకులపల్లి: కేఓసీలో స్థానికులకు లోడింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వకుండా ఇల్లెందు అసోసియేషన్ లారీలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని టేకులపల్లి లారీ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం లారీ యజమానులు, వారి కుటుంబ సభ్యులు కేఓసీ లారీ స్టాండ్ వద్ద నిరసన తెలియజేసి తమ గోడు చెప్పుకున్నారు. గతంలో 40 లారీలు ఉండేవని సరిగా లోడింగ్ లేక, ఇతర కారణాల వల్ల లారీలు ఫైనాన్స్‌లకు అప్పజెప్పడం జరిగిందని, ప్రస్తుతం 14 మాత్రమే మిగిలాయని బాధిత యజమానులు వాపోయారు. కేఓసీలో స్థానిక లారీలకు లోడింగ్ ఇవ్వకపోవడంతో బ్యాంకు లోన్ కట్టలేకపోతున్నామని పేర్కొన్నారు. ఇల్లెందులో లోడింగ్‌కు ప్రయత్నిస్తే ఇల్లెందు అసోసియేషన్ అధ్యక్షుడు సహకరించకపోగా టేకులపల్లికి చెందిన వారికి ఇల్లెందులో ఇవ్వమన్నారని, టేకులపల్లిలోని కేఓసీకి వస్తే ఇల్లెందు నుంచి 70 లారీలు పంపించడం వల్ల స్థానికులకు అవకాశం లేదంటున్నారని వాపోయారు. ఇదేమిటని అడిగితే బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఇతర ప్రాంతాల్లో స్థానిక వాహనాలకే ప్రాధాన్యం ఇస్తుండగా ఇక్కడ మాత్రం స్థానికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ట్రాన్స్‌పోర్టర్, రాజకీయ నాయకులు ఎవరూ సహకరించడం లేదని వాపోయారు. తోటకూరి నాగరాజు, ఇస్లావత్ గణేష్, అనిల్, జంగం మురళి, సతీష్, రాంబాబు, శ్రీను, జంగం భూషణం పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అధ్వానంగా రహదారి



జూలూరుపాడు - వినోభానగర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారి ప్రమాదకరంగా ఉంది. రోడ్డు దెబ్బతిని పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దగ్గరకు వచ్చే వరకు గుంతలు కన్పించకపోవడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : గణేష్,
ఆర్అండ్‌బీ ఏఈ, జూలూరుపాడు
సెల్ నంబర్: 9440819020